క్లుప్తంగా

ఒంగోలు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు కదం తొక్కారు. ఒంగోలు వెళ్లిన వారిలో మండల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, నాయకులు ఉడుముల గురవారెడ్డి, గాడి కోనేటిరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 15లోగా మినుము, జొన్న, మొక్కజొన్న, శనగ, మిరప పంటలకు బీమా చేసుకోవాలని, వరికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. ఎకరానికి శనగకు రూ.368, మినుము రూ.103, మొక్కజొన్న రూ.105, ఎండు మిరప రూ.525, జొన్న రూ.60, వరికి రూ.215ను మీ సేవ కేంద్రాలు లేదా సీఎస్సీల్లో చెల్లించాలని సూచించారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

కొమరోలు: మండలంలోని 9 సాగునీటి చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లుగా తహసీల్దార్ డి.భాగ్యలక్ష్మి తెలిపారు. కొమరోలు-1, కొమరోలు-2, రాజుపాలెం, తాటిచెర్ల, ఇడమకల్లు-1, ఇడమకల్లు-2, పుల్లారెడ్డిపల్లె, రెడ్డిచెర్ల-1, రెడ్డిచెర్ల-2 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని ఆరు గ్రామాల సాగు నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. వాగుమడుగు, అంబాపురం, వద్దిమడుగు, తువ్వపాడు, చినారికట్ల, పెదారికట్లలో ఎన్నికలు జరగనున్నాయి.

నీటి పన్ను రశీదులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికల్లో పోటీ చేసేందుకు భూమిశిస్తు-నీటిపన్ను రశీదులు ఇవ్వాలని తహసీల్దార్ జితేంద్రకుమార్‌ను ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి శుక్రవారం కోరారు. నీటి పన్ను డిమాండ్ నోటీస్‌లు చెరువు ఆయకట్టులోని రైతులకు ఇవ్వకపోవడంతో పన్ను ఎంత ఉందో ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. ఎన్నికల విధివిధానాలపై గ్రామాల్లో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించలేదన్నారు. దీంతో స్పందించిన తహసీల్దార్.. వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసి నీటి పన్ను కట్టించుకునేలా ఆదేశాలిస్తామని, పన్ను డిమాండ్ నోటీసులు రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఆముదాలపల్లిలో బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదిలి రూరల్: పొదిలి మండలంలో సాగు నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో పొదిలి, ఆముదాలపల్లి పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన వసతులు, సామగ్రి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సమయంలో పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని చెప్పారు. ఆయన వెంట వీఆర్వోలు ఉన్నారు.

- మార్కాపురం పట్టణంలో బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం
- స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ర్యాంకు కోసం తీర్మానం
- సరిపడా టాయిలెట్లు ఎక్కడని ప్రశ్నిస్తున్న ప్రజలు
- గాలిగోపుర నూతన నిర్మాణం, 2024 ఎన్నికల నామినేషన్ సమయంలో రెండు యూరినల్స్ తొలగింపు
- కూరగాయల మార్కెట్ వద్ద నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఆర్టీసీ డిపోలో దారుణంగా తయారైన యూరినల్స్



‘ఇచ్చటొద్దు’ సరే.. మరెచ్చట?

మార్కాపురం పట్టణంలో బహిరంగా మలమూత్ర విసర్జనపై నిషేధం విధిస్తూ మున్సిపల్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు, వార్డు సభ్యులు, మహిళ సంఘాల మహిళలతో తీర్మానం చేయించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ -2024 లో మార్కాపురం పురపాలక సంఘానికి మెరుగైన ర్యాంకు తీసుకురావాలని నిర్ణయించారు. పాలకుల ఉద్దేశం మంచిదే కానీ అందుకు అనుగుణంగా తీసుకున్న చర్యలు ఏమిటనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలింది. పట్టణ ప్రజలతోపాటు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు అత్యవసరసమయాల్లో వినియోగించుకునేందుకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయకుండా ర్యాంకుల కోసం ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్కాపురం టౌన్:

మార్కాపురం పట్టణంలో పబ్లిక్ టాయిలెట్ల సమస్య ప్రజలను వేధిస్తోంది. పట్టణంలో సుమారు 90 వేల మంది జనాభా ఉన్నారు. వివిధ అవసరాల నిమిత్తం మార్కాపురానికి రోజూ పది వేల మందికి పైగా జనాభా వస్తుంటారు. శ్రీశైలం, త్రిపురాంతకం, వెలుగొండ వెంకటేశ్వర స్వామి తదితర పుణ్య క్షేత్రాలకు వెళ్లే భక్తులు మార్కాపురం మీదుగానే ప్రయాణం సాగిస్తారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, కూలీలు అర్ధరాత్రి నుంచే పనిచేస్తుంటారు. ఉదయం నుంచి పట్టణ ప్రజలతో పాటు కూరగాయల కోసం ఇతర ప్రాంతాల ప్రజలు, మహిళలు వందలాదిగా వస్తారు. అయితే పట్టణంలో అక్కడక్కడా ఏర్పాటు చేసిన టాయిలెట్లు నిరుపయోగంగా మారడంతో ప్రజలంతా కాలకృత్యాలు తీర్చుకునే మార్గం లేక ఉగ్గబట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



ఆర్టీసీ బస్టాండ్‌లో టాయిలెట్ల దుస్థితి

ఇదీ టాయిలెట్ల పరిస్థితి

మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో పే అండ్ యూజ్ టాయిలెట్లు 3 ఉండగా, పురపాలక సంఘం పరిధిలో కొన్నేళ్ల కిందట పట్టణంలోని సప్తగిరి లాడ్జి కూరగాయల మార్కెట్, కోర్టు సెంటర్, పాత బస్టాండ్‌లో అదనంగా టాయిలెట్లు ఏర్పాటు చేశారు. అయితే వీటికి నీటి సౌకర్యం లేక దుర్వాసన వస్తుండటంతో పురుషులు వినియోగించుకునేందుకు విముఖత చూపుతూ గోడలు, వాహనాల చాటున కాలకృత్యాలు తీర్చుకోవడం ప్రారంభించారు. కేవలం ఉదయం వేళ ఒకసారి శుభ్రం చేసి వదిలేస్తుండటంతో ముక్కు మూసుకుని పోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఇక పాత బస్టాండ్‌లో పే అండ్ యూజ్ టాయిలెంట్ ఉండగా చెన్నకేశవ స్వామి గాలిగోపురం నిర్మాణ సమయంలో తొలగించారు. కోర్టు సెంటర్‌లో ఉన్న పురపాలక సంఘం టాయిలెట్‌ను 2024 ఎన్నికల సమయంలో అడ్డుగా ఉందని అధికారులు తొలగించారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో టాయిలెట్లు లేక, ఉన్నవాటి నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛత ర్యాంకులు ఎలా సాధ్యమన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



కూరగాయల మార్కెట్ వద్ద టాయిలెట్ పరిస్థితి



కోర్టు సెంటర్‌లో తొలగించిన టాయిలెట్

టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

మార్కాపురం పట్టణానికి వివిధ పనుల నిమిత్తం ఎంతో మంది ప్రజలు, మహిళలు వస్తుంటారు. జనాభా ప్రాతిపదికన అవసరమైన మేర టాయిలెట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. ప్రధాన కూడళ్లలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– షేక్ రజాక్, ఎంపీజే నాయకుడు

పర్యవేక్షణ అవసరం

ప్రజల అవసరాలను తీర్చే పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన నిషేధం మంచిదే. దానికి అనుగుణంగా ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తేనే లక్ష్యాలను చేరుకోవచ్చు. టాయిలెట్లను నిర్ణీత సమయాల్లో శుభ్రం చేయించేలా శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుదర్శన్, ఆప్ నాయకుడు

గుంతల డిపో.. కాస్త చూసిపో..!



మురికి కుంటను తలపిస్తున్న డిపోలో ఖాళీ స్థలం



డిపో ముందు భాగంలో నిలిచిన వర్షం నీరు(ఫైల్)



డిపో లోపలికి వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి ఇదీ..

- దారుణంగా గిద్దలూరు ఆర్టీసీ డిపో ప్రాంగణం
- ఆదాయంపైనే కాదు మౌలిక వసతులపై దృష్టి సారించాలని ప్రజల వినతి

గిద్దలూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణ బురదమయమైంది. వర్షపునీరు నిలిచి అపరిశుభ్రంగా మారింది. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం నీరు డిపో ఆవణంలో నుంచి బయటకు వెళ్లేందుకు వీల్లేకపోవడం, డిపోలో రాకపోకలు సాగించే ప్రధాన రోడ్లపై భారీ పరిమాణంలో గుంతలు పడటంతో ఆవరణ మొత్తం అస్తవ్యస్తంగా మారింది. గుంతల్లోకి వర్షం నీరు చేరి ప్రయాణికులు నడిచేందుకు వీల్లేని పరస్థితి ఏర్పడుతోంది. భారీ వర్షం కురిస్తే డిపో ఆవరణలో కుడివైపు ఉండే ఖాళీ స్థలం కుంటను తలపిస్తోంది. లగేజీతో బస్సు ఎక్కేందుకు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం బస్సులకు వచ్చే ఆదాయంపై మాత్రమే దృష్టి పెడుతున్న ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు కనీస మౌలిక వసతులు కల్పించాలన్న విషయాన్ని మరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై అర్జీలిస్తే పరిష్కరిస్తాం



మీర్జపేటలో అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

తర్లుపాడు: ప్రజల భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ త్రివినాగ్ చెప్పారు. మండలంలోని మీర్జపేట గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును తహసీల్దార్ యు.విజయభాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్‌కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మీరయ్య, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, వీఆర్‌ఓ మస్తాన్‌వలి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డి, సర్వేయర్ రవీంద్రరెడ్డి, శ్రీను, మస్తాన్‌రెడ్డి, సావిత్రి, రఫీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవిన్యూ సభలో 32 అర్జీలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తకోట గ్రామంలో రెవెన్యూ సదస్సుకు వివిధ సమస్యలపై 32 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. ప్రాధాన్య క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్‌ఐ భాస్కర్ రావు, వీఆర్‌ఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లపల్లిలో 14 అర్జీలు

కంభం: రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వి.కిరణ్ తెలిపారు. పోరుమామిళ్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో మ్యుటేషన్ కోసం-14, పొలం సర్వే కోసం 3 అర్జీలు వచ్చాయని వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బురదమయంగా అంతర్గత రోడ్డు



ఓబుల్‌రెడ్డిపల్లెలో బురదమయంగా మారిన రోడ్డు



ఓబుల్‌రెడ్డిపల్లెలో రోడ్డుపై నిలిచిన మురికినీరు



జేపీ చెరువులో చెరువులా తలపిస్తున్న అంతర్గత రోడ్డు

రాచర్ల: మండలంలోని ఒబుల్‌రెడ్డిపల్లె, జేపీ చెరువు గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు బురదమయమయ్యాయి. సైడుకాలువలు ఆక్రమణకు గురికావడంతో కొద్దిపాటి వర్షం పడినా నీరు నిలిచిపోతున్నాయి. దీంతో సీసీ రోడ్లపై నడిచే పరిస్థితి లేకుండా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జేపీ చెరువు గ్రామంలో పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డుపై 500 అడుగుల మేర వర్షం నీరు నిలిచి కుంటలా దర్శనమిస్తోంది. పొలాలకు వెళ్లే రైతులు, స్కూల్ విద్యార్థులు మలుమార్లు బురదనీటిలో జారి పడిపోయారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం



పేరుకుపోయిన చెత్త



సైడు కాలువలో నిల్వ ఉన్న మురుగు

పొదిలి: పట్టణంలోని విశ్వనాథపురం రెండో లైనులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. సైడు కాలువలో నిల్వ ఉన్న మురుగు.. లోతట్టుగా ఉన్న ఇళ్లలోకి చేరుతోంది. దీంతో గృహ యజమానులు ఆందోళన చెందుతున్నారు. కాలనీలో దుర్వాసన తోపాటు దోమల బెడద అధికంగా ఉంది. మరో వైపు ఈ రోడ్డులోనే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త వేస్తున్నారు. గత నాలుగు రోజులుగా చెత్త తొలగించకపోవడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ దారిలో రాకపోకలు సాగించే విద్యార్థులు, స్థానికులు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి. అధికారులు స్పందించి చెత్తను శుభ్రం చేయించటంతో పాటు మురుగు ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి ఛిద్రం.. మరమ్మతులు మృగ్యం



దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారి

కొమరోలు: మండలంలోని ద్వారకచర్ల గ్రామ సమీపంలో రహదారి ఛిద్రమై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో కొమరోలు-గిద్దలూరు వెళ్లే రహదారిలో మూలమలుపు వద్ద భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. ఈ సమస్యను గ్రహించిన ఓ స్వచ్ఛంద సంస్థ మట్టితో గుంతను పూడ్చినప్పటికీ వర్షాలకు కొట్టుకుపోయింది. దగ్గరికి వచ్చేంత వరకు గుంత కనిపించకపోవడంతతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొమరోలు నుంచి గిద్దలూరుకు రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వెలుగు ఏపీఎం, సీసీలకు సన్మానం



ఏపీఎం, సీసీలను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొనకనమిట్ల: స్థానిక వెలుగు కార్యాలయంలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన ఏపీఎం, సీసీలను శుక్రవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏపీఎం కె.గోపాలకృష్ణారెడ్డి, సీసీలు యల్రా, రాజయ్య, సుబ్బయ్య పొదిలి మండలానికి బదిలీ కాగా వారికి ఏపీఎం సుధాకర్ ఆధ్వర్యంలో తోటి సిబ్బంది వీడ్కోలు పలికారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు యంబాడి ఈశ్వరమ్మ, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శబరిమల తరలిన అయ్యప్ప భక్తులు



మాలధారులకు ఇరుముడి కడుతున్న గురుస్వాములు

పొదిలి: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శుక్రవారం అధిక సంఖ్యలో మాలధారులు శబరిమల తరలివెళ్లారు. వేకువ జాము నుంచే స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పను శరణు కోరుతూ భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం గురుస్వాములతో ఇరుముడి కట్టించుకున్నారు. పూజారులు మురళీ కృష్ణమాచార్యులు, వాసు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు, వారి బంధువులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమంలో గురుస్వాములు యక్కలి శేషగిరి రావు, అప్పల శంకర్, కాటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.